క్లుప్తంగా

రూ.5లక్షల ఎల్‌ఓసీ అందజేత



ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి గ్రామానికి చెందిన బలరాం కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో వైద్యసాయం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.5 లక్షలు మంజూరు అయ్యాయి. మంజూరైన ఎల్‌ఓసీని మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో వారు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, లింగం, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలి



మరికల్: మండలంలోని పస్పుల నుంచి అప్పంపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారి ఏళ్లుగా బీటీరోడ్డుకు నోచుకోవడం లేదు. రెండు గ్రామాల మధ్య దాదాపు మూడు కిలోమీటర్ల రహదారి వర్షాలకు అధ్వానంగా మారింది. దారి ఇరువైపులా ముళ్లచెట్లు కమ్ముకోవడమే కాకుండా గుంతలమయంగా మారడంతో బీటీరోడ్డు మంజూరు చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే స్పందించి ఈ రహదారిని బీటీరోడ్డుగా మార్చాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణా: కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టు 25 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతుండడంతో నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఎండీ నవీద్ సూచించారు. బుధవారం ఎస్‌ఐ సిబ్బందితో కలిసి కృష్ణా, భీమ నదుల ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని వదులుతుండడంతో చేపలు పట్టడానికి, రైతులు, పశువుల కాపరులు నది వైపు వెళ్లొద్దని హెచ్చరించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే తమను సంప్రదించాలని సూచించారు.

కొండచిలువ కలకలం



మరికల్: మండలంలోని వెంకటాపూర్ శివారుల్లోని ఓ రైతు వ్యవసాయ పొలంలో పది అడుగుల కొండచిలువ పట్టుబడింది. బుధవారం సూరహరి అనే రైతు పొలంలో పశువులకు పచ్చి చొప్ప కొస్తుండగా ఆకస్మాతుగా కొండచిలువ కనిపించడంతో భయంతో పరుగులు తీశాడు. విషయాన్ని పక్క పొలంలో ఉన్న రైతులకు చెప్పడంతో అక్కడికి చేరుకొని కర్రలతో కొట్టి చంపేశారు. పక్కనే జూరాల, కోయిలసాగర్ కాలువలు ఉండటంతో కొండచిలువలు, మొసళ్లు సంచరించే అవకాశం ఉందని పొలాల దగ్గరకు వెళ్లే రైతులు జాగ్రతగా ఉండాలని అధికారులు సూచించారు.

‘పేట’ లో ఉచిత వైద్యశిబిరం



నారాయణపేట రూరల్: పట్టణంలోని యశోద కేర్ హాస్పిటల్‌లో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దాదాపు 200 మంది ప్రజలు రాగా డాక్టర్ రాజ్ కుమార్, ప్రీతి రెడ్డి పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్, కార్యదర్శి సాయినాథ్, కోశాధికారి రాధ, సదానంద్ చారి, శ్రీనివాస్, కృష్ణమూర్తి, సాయిబాబా, సురేందర్ చారి పాల్గొన్నారు.

నాయకుల సన్మానం

నారాయణపేట రూరల్: విశ్వ హిందూ పరిషత్ జిల్లా నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన సురేఖను బుదవారం బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించారు. భర్త డాక్టర్ రాంబాబు అడుగుజాడల్లో నడిచేందుకు అదే మార్గాన్ని ఎంచుకోవడం, హిందుత్వాన్ని బలోపేతం చేయడానికి ముందుకు రావడంపై ఆమెను అభినందించారు.

‘మధ్యాహ్న’ బిల్లులు అందేనా?

- పెండింగ్‌లో వంట సహాయకుల వేతనాలు
- గత ఫిబ్రవరి నుంచి బిల్లుల పెండింగ్



కాన్‌కుర్తిలో వంట చేస్తున్న కార్మికులు (ఫైల్)

దామరగిద్ద: ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనం పథకం ఏజెన్సీ నిర్వాహకులకు సకాలంలో బిల్లులు అందక ఆర్థిక ఇబ్బందుల్లో మగ్గుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వాటాల వారీగా అందజేసే బిల్లుల చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులు, వంట సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 27, ప్రాథమికోన్నత పాఠశాలలు 11, ఉన్నత పాఠశాలలు 6 ఉన్నాయి. ఆయా పాఠశాలల పరిధిలో 5450 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు ప్రతి రోజు మధ్యాహ్న భోజనం అందించే నిర్వాహకులకు ప్రతి నెల 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సంబంధించి మార్చి వరకు బిల్లులు చెల్లించగా ఏప్రిల్ నుంచి బిల్లులు చెల్లించలేదు. ఇక 9వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు సంబంధించి జనవరి నుంచి జూన్ వరకు బిల్లులు సబ్‌మిట్ చేయగా ఎస్‌టీఓ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు అంటున్నారు.

8 నెలలుగా అందని బిల్లులు

మండలంలోని ఆయా పాఠశాలల్లో వంట సహాయకులుగా 121 మంది పనిచేస్తున్నారు. వారికి నెల నెల కేంద్ర ప్రభుత్వం రూ.1000 చెల్లిస్తుంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా రూ.2 వేల అందిస్తుండగా డిసెంబర్ నుంచి మార్చి వరకు వేతన బిల్లులు సబ్‌మిట్ చేసిన ఇప్పటి వరకు అందలేదు.

బిల్లులు సబ్మిట్ చేశాం



వంట ఏజెన్సీలకు, సీసీహెచ్‌లకు అందాల్సిన బిల్లులకు సంబంధించి నిధులు అందుబాటులో ఉన్నాయి. వంట బిల్లులు, వేతన బకాయిలు చెల్లించేలా ఎస్‌టీఓకు సబ్‌మిట్ చేశాం. ఖాతాల్లో డబ్బులు జమ కావాల్సి ఉంది. రూ.2వేల వేతనం బిల్లులు క్లియర్ కాగానే ఖాతాల్లో జమ అవుతాయి.

–కృష్ణారెడ్డి, ఎంఈఓ, దామరగిద

బిల్లులు త్వరగా చెల్లించాలి



ప్రభుత్వం వంట ఏజెన్సీ బిల్లులను సకాలంలో చెల్లించి ఆదుకోవాలి. గత డిసెంబర్ నుంచి 5 నెలల బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబపోషణ భారంగా మారింది. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించి ఆదుకోవాలి.

–ఈదప్ప, వంట ఏజెన్సీ నిర్వాహకుడు, దామరగిద్ద

అధికారులు స్పందించాలి



గత ఎనిమిది నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు బిల్లులు పంపించాం అంటున్నారు. కానీ డబ్బులు మాత్రం జమ కాలేదు. కేంద్రం చెల్లించే రూ.1000 మాత్రమే రెగ్యులర్‌గా వేస్తున్నారు. మిగిలిన రూ.2వేలు మాత్రం పడడం లేదు. ఉన్నతాధికారులు స్పందంచి వేతనాలు చెల్లించేలా చొరవ తీసుకోవాలి.

–లక్ష్మి, వంట సహయకురాలు,కాన్‌కుర్తి

కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి

నారాయనపేట టౌన్: కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి వారిని పర్మినెంట్ చేయాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో ఆటో కార్మికులు, చేనేత కార్మికులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీబీవి వర్కర్స్ వెంకటమ్మ, లక్ష్మీ, వీరమని, ఆటో వర్కర్స్ వెంకటప్ప, రమేష్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా



మక్తల్‌లో కరపత్రాలు విడుదల చేస్తున్న టీయూసీఐ నాయకులు

మక్తల్: కాంట్రాక్టు కార్మికులను రెగ్యులైజ్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని గురువారం కలెక్టరేట్ ముందు చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని టీయూసీఐ అధ్యక్షుడు కిరణ్ కోరారు. ఈ మేరకు ధర్నాకు సంబంధించిన కరపత్రాలను బుధవారం మక్తల్‌లో విడుదల చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కొలిమి రాములు, అయ్యప్ప, లక్ష్మన్, ఆనందు, పద్మమ్మ, నరేస్, వెంకటయ్య, సువన్న, నరేందర్, అంజి, మల్లేష్, అంజన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దారి మూసివేయడంపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు పిర్యాదు చేస్తున్న రైతులు

దామరగిద్ద: మండలంలోని లోకూర్తి గ్రామంలో పంట పొలాలకు వెళ్లే దారిని మూసివేయడంపై కొందరు రైతులు బుధవారం తహసీల్దార్ తిరుపతయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోపాల్, రామకృష్ణ మాట్లాడుతూ గతంలో ఉన్న పొలం బాటను కొందరు రైతులు తమ స్వార్థానికి రాళ్ళతో మూసి వేయడంతో దాదాపు 30 రైతు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. అధికారులు చొరవ తీసుకొని పొలాలకు దారి వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లోకూర్తి గ్రామ రైతులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రైం: సమాజంలో ఎవరూ కూడా వర్గాలుగా విడిపోయి గొడవలు పెట్టడం సమాజ అభివృద్ధికి ఆటంకం కల్గించడం చేయరాదని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ‘ప్రజా భద్రత–పోలీస్ బాధ్యత’ నిర్వహించారు. ఎన్నికల సమయాల్లో గందరగోళం సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని క్రైం డవర్ త ప్పదన్నారు. ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం చేయరాదని, అక్రమ రేషన్ వ్యాపారం చేయడం నేరమన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, కుటుంబ పెద్దలు నిత్యం ఇంట్లోని పిల్లలను పర్యవేక్షిస్తుండాలన్నారు. మహిళల పట్ల తప్పుగా ప్రవర్తిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ అప్పయ్య, ఎస్‌ఐ శీనయ్య, మహిళా ఎస్‌ఐ సుజాత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు ఇలా.. ప్రయాణం ఎలా



ఊట్కూరులోని పాతపేట ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర కల్వర్టు ప్రమాదకరంగా మారింది. డ్రెయినేజీపై వేసిన కప్ప కొన్ని నెలల క్రితం ధ్వంసమైంది. దీంతో కల్వర్టుపై రెండు ఫీట్లు మాత్రమే మిగిలి ఉండడంతో చేసేది లేక పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు అలానే ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. పాత పేటలో ప్రధాన రహదారిపై గల కల్వర్టు ఇలా మారడంతో స్థానికులు చుట్టూ తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. రాత్రి వేళలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు. - ఊట్కూరు

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



దామరగిద్ద: మండల కేంద్రంలోని సంజీవరాయ కాలనీల్లో బుధవారం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాల ఎత్తు తగ్గడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. దీంతో విద్యుత్ ఏఈ అనిల్ కమార్ స్పందించి పాత పోల్స్ స్థానంలో ఎక్కువ ఎత్తు కల్గిన విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ మోదీన్. నర్సిరెడ్డి, జేఎల్‌ఎంలు రాఘవేందర్, నీలకంఠ, రాజు, సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి చెక్కు అందజేత



కొత్తపల్లి: మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుదవారం మాజీ సర్పంచ్ రమేశ్ రెడ్డి, పంచాయతి కార్యదర్శి శ్రీను నాయక్‌తో కలిసి రూ.లక్ష చెక్కును అందజేశారు. గ్రామంలో 20 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 3 ఇళ్లకు ఫొటో క్యాప్చరింగ్ పూర్తి చేయగా రెండు ఇళ్లకు రూ.లక్ష బిల్లు మంజూరు అయినట్లు తెలిపారు. అలాగే లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ముదేలి శ్రీనివాస్ రెడ్డి, కొండప్ప, చన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.3లక్షలతో కమ్యూనిటీ మరుగుదొడ్లు

కోస్గి రూరల్: మండలంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ టాయిలెట్ల నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీఓ శ్రీధర్ పర్యవేక్షించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గుండుమాల్ మండల పరిధిలోని అమ్లీకుంటలో వీరభద్ర ఆలయం సమీపంలో రూ.3లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్లను నిర్మిస్తుండడంతో పరిశీలించి గుత్తేదారుకు పలు సూచనలు చేశారు. వెంట ఎంపీఓ వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

నగరేశ్వరుడికి శ్రావణ మాస పూజలు

దామరగిద్ద: మండల కేంద్రంలోని నగరేశ్వర ఆలయంలో బుధవారం శ్రావణ మాస ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, మహిళలు పాల్గొన్నారు.



ఇసుక తరలిస్తే అడ్డుకుంటాం



ఇసుక లారీలను ఆపేసిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్: కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకం పేరుతో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే అడ్డుకుంటామని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాగనూర్ మండల కేంద్రంలోని పెద్ద వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్ సిబ్బంది ఇసుకను తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహారించడంపై మండిపడ్డారు. ఇసుక తరలింపునకు సంబంధించిన అనుమతులను చూపించాలని కోరారు. ఇసుక తరలింపులతో స్థానికంగా ఉన్న రైతులు, గ్రామస్తులు సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయని అనుమతులు మరో చోటు ఇవ్వాలని కోరిన రైతుల అభిప్రాయలతో పని లేకుండా అధికారులు ఇష్టానుసరంగా ఇసుక తరలింపును ప్రోత్సహించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మాజీ ఎమ్మెల్యే ఇసుకను అడ్డుకుని తిరిగి వెళ్లిన 15 నిమిషాల్లోనే అధికారులు మళ్లీ ఇసుకను తరలించారు. ఈ విషయంపై అధికారులను వివరణ అడగగా.. సంబంధిత కాంట్రాక్టర్ కలెక్టర్ కార్యాలయంలో దాదాపుగా 100 టిప్పర్ల ఇసుకకు రూ.20 లక్షలు చెల్లించి అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటిన రాజ్‌కుమార్ రెడ్డి, సభ్యులు

నారాయణపేట: పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకొని భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని శాసనపల్లి రోడ్డులో ఉన్న కాశీనాథేశ్వర కాలనీలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ కాలుష్యాన్ని అరికట్టాలంటే తప్పనిసరిగా అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, హన్మంతు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహాగర్జనను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

కొత్తపల్లి: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 2న నిర్వహించనున్న మినీ మహాగర్జన సభను విజయవంతం చేయాలని దివ్యాంగుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య దివ్యాంగుల గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా సాయిలు, ఉపాధ్యక్షుడిగా తులసిరామ్ అలాగే చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లను పెంచాలని కోరారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు అభినందనలు



కృష్ణారెడ్డిని సన్మానించిన వాకిటి లలిత, మండల నాయకులు

నర్వ: ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కృష్ణారెడ్డిని బుధవారం మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మ అభినందనలు తెలిపారు. ఆయన స్వగృహంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఆయనతో పాటు మండలానికి చెందిన పాథర్చేడ్ గ్రామ నెట్టెంపాడు వెంకటయ్య, నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మార్క నరేష్‌లు ఆత్మకూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లుగా ఎన్నికవడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, శరణప్ప, ఆనంద్‌గౌడ్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుత సేవలతోనే గుర్తింపు

మద్దూరు: బాధ్యతాయుత సేవలతోనే ఉద్యోగికి ప్రజల్లో గుర్తింపు వస్తుందని ఎంపీడీఓ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం ఆయన పదవి విరమణ చేయగా తోటి సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. దాదాపు 38 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగిగా ఎలాంటి మచ్చ లేకుండా సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం నర్సింహారెడ్డి దంపతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన



మద్దూరు: ప్రజలు పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో సహకరించాలని పుర కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా బాపన్‌గేరి, రాయ్యలి గేరిలో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు. అలాగే ప్లాస్టిక్‌ను నిషేధించి బట్ట సంచులను వాడాలన్నారు. కార్యక్రమంలో పుర సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత తప్పనిసరి

అమరచింత: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 8వ వార్డులో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి చెత్త ట్రాక్టర్‌లో వేయాలన్నారు. వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

డైనింగ్‌హాల్‌కు భూమిపూజ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో బాలికల హాస్టల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఎక్స్‌టెన్షన్ డైనింగ్‌హాల్ నిర్మాణానికి వీసీ శ్రీనివాస్ భూమిపూజ నిర్వహించారు. ఈ మేరకు పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డైనింగ్‌హాల్ ఉపయోగపడనుంది. కార్యక్రమంలో రమేష్ బాబు, చంద్రకిరణ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

గూడ్స్ వాహనాలు వినియోగిస్తే చర్యలు



మద్దూరు: గూడ్స్ వాహనాలను ప్రజా రవాణాకు వినియోగిస్తే ఆ వాహనాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలో వాహనాల తనిఖీలో భాగంగా గూడ్స్ వాహనాలల్లో కూలీలను తరలిస్తుండగా మూడు వాహనాలను పట్టుకొని జరిమానా విధించారు. అనంతరం గూడ్స్ వాహనా యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రజా రవాణాకు గూడ్స్ వాహనాలు వినియోగిస్తే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

అమరచింత: విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికరమైన ఆహారం అందించాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏడీ, మండల ప్రత్యేక ఆధికారి అఫ్జలుద్దీన్ అన్నారు. మండలంలోని ఎస్సీ వసతి గృహాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ మేరకు స్టాక్‌రూంలో సరుకుల వివరాలు, నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నారనే విషయాలను వార్డెన్ చంద్రన్‌ను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌కు రక్షణగోడ లేక పోవడంతో విష పురుగులు, పశువులు వస్తున్నాయని ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కారం కోసం కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

ఆగస్టు 3లోగా వివరాలు అందజేయాలి

అమరచింత: చేనేత రుణమాఫీ కోసం నేటికీ వివరాలు అందజేయని కార్మికులు ఆగస్టు 3వ తేదీలోపు అందించాలని చేనేత జౌళిశాఖ ఏడీ గోవిందయ్య బుధవారం తెలిపారు. జిల్లాలోని ఆయా జాతీయ బ్యాంకుల ద్వారా రూ.లక్ష లోపు రుణాలను పొందిన నేత కార్మికుల జాబితాను ఇప్పటికే అందజేశారన్నారు. ఇంకా ఎవరైనా వ్యక్తిగతంగా రుణాలను తీసుకొని ఉంటే ఆయా బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించి తమ వివరాలను ఏడీ కార్యాలయంలో అందజేయాలని కోరారు.